# కొండ మల్లె...

## స్టోరీ



"గౌరునాయుడు"

కిటికీ లోంచి ఎండ ఏటవాలుగా పడుతోంది. కొండవెనక సూర్యుడు మెల్లగా పైకి లేస్తున్నాడు. ప్రత్యూషపవనాలు అడవిపూల పరిమళాల్ని మోసుకొస్తూ రకరకాల పిట్టల అరుపుల్తో కలిసి ఉదయ రాగాలు ఆలపిస్తున్నాయి. ఎత్తైన చెట్లు... కొండ శిఖరం... ఎగురుతున్న పక్షులు ఫ్రేం కట్టినట్టు కిటికీలోంచి అద్భుత వర్ణచిత్రంలా కన్పిస్తోంది ప్రకృతి. రాళ్ళను ఒరుసుకుంటూ ప్రవహిస్తున్న గెడ్డనీళ్ళసందడి... అలల సవ్వడి నేపథ్య సంగీతంలా.. లీలగా వినిపిస్తోంది.

బయుట విప్పచెట్టు క్రింద రాలిన మొగ్గలు ఏరుతోంది బూది. చెట్టు కొమ్మ మీద తలవూపుతోన్న తొండపిల్ల మీదికి రాళ్ళు విసురుతూ... దిస మొలతో ఆడుతోంది బూది కూతురు నాలుగేళ్ళది.

పాపం బూది.

అసలు బూది ఎవరితోనూ మాట్లాడేదికాదు. అది అమాయకురాలు. మా 'గూడ' నుండి ప్రతిగురువారం అందరూ కురుపాం సంతకెళ్ళి కావలసిన సరుకులు కొనుక్కొని సినిమా చూసి వస్తారు. మా గూడ జనాలకున్న ఒకే ఒక్క వినోదమది. బూది అలాకూడా వెళ్ళేది కాదు. అటువంటిబూది ఆ సుక్కడి చూపులకి ఎలా చిక్కుబడిపోయిందో. సుక్కడు మా స్కూలు హాస్టల్‌లో 'కుక్' గా చేరేడు. పెళ్ళి కాలేదని ఒక్కడే వుండేవాడు. ఏమంత్రం వేసేడో బూది ప్రతిరోజూ సాయంత్రం హాస్టలు వెనక జీడితోటలో సుక్కడిని కలుసుకునేదట. ఈ విషయం స్కూలులోనూ... ఊళ్ళోనూ తెలిసింది. అప్పుడు నేను పదో తరగతి చదువుతున్నాను.

మాకు పరీక్షలు ఐపోయేయి

బూది తల్లి కాబోతుందన్నారు.

స్కూలుకు శలవులు యిచ్చేరు.

శలవులకు వూరెళ్ళిన సుక్కడు మరి తిరిగి రాలేదు.

బూదికీ నాకూ... రెండేళ్ళ తేడావుంటుంది వయసులో నేనూ... బూదీ కలిసే తిరిగేవాళ్ళం. మేకలు కాసేవాళ్ళం... విప్ప మొగ్గలు ఏరేవాళ్ళం. మా పెద్దోళ్ళు కఱ్ఱలు కొడితే... మేం చిన్న చిన్న మోపులు కట్టి... ఏ లారీకో.. జీపుకో వేసేవాళ్ళం...

కంది కొత్తల పండుగ వస్తే చాలు... ఒకటే సందడి. ఒళ్ళెరగకుండా చిందులేసేవాళ్ళం. తుడుము డప్పుల దరువులు వింటే మాకాళ్ళు నిలబడేవి కావు.

నలభై పాకలున్న మా సవరగూడలో చదివిన వారు ఎవరూ లేరు. గిరిజన తెగల్లో బాగా వెనుకబడి వున్నది మా సవరలే.

అప్పుడు మా ఒంటిమీద చిన్న చినిగిన తువ్వాలు గుడ్డలు తప్ప మరేమీ వుండేవి కావు. ముక్కులకి కమ్ములు, కాళ్ళకి వెండితో చేసిన కడియాలు వుండేవి.

మా తిండి విషయంలో మాకేమీ రుచులమీద కోరికలుండేవికాదు. ఆయా రుతువుల్లో లభించేపళ్ళు, ఆకుకూరలు, దుంపలు తినేవాళ్ళం. పోడుచేసి పండించిన కొఱ్ఱలు, సామలు, జొన్నలు... జీలుగు పిండితో చేసిన అంబలి... టెంకపిండి అంబలి... యిదీ మా ఆహారం. వరి అన్నం సంగతి మాకు తెలీనేతెలీదు. ఇప్పటి పరిస్థితులతో ఆనాటి రోజుల్ని పోల్చి చూసుకుంటే నాకెంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఈ మార్పు వెనుక... యీ సుఖాల వెనుక ఎంత వ్యధ. ఆ పోరాటాల్నీ... త్యాగాల్నీ కథలు కథలుగా చెప్పేవాడు మా అయ్య. అలా చెప్తున్నపుడు అయ్యకళ్ళలో నీళ్ళు తిరిగేవి. నా ఒళ్ళు జలదరించేది.

నాకు వూహ తెలిసాక ఓసారి మెనింజైటిస్ అట (ఆ తరువాత తెలిసింది) వ్యాధి సోకింది. గిరిజన గూడల్నీ... అడివి అడివంతటినీ అతలాకుతలం చేసింది. చావులు చూడని రోజులేదు. మా మామ ఎజ్జోడు కానికిలు పోసి జబ్బు నయం చేస్తానంటే అప్పటి అధికారులు తిట్టి ఆస్పత్రికి పంపించడం నాకిప్పటికీ గుర్తే. అప్పుడే బూది చచ్చిపోవాల్సింది. మా 'మామకానికల్ని' నమ్ముకుంటే బూది మరి దక్కేది కాదు. అదిగో ఆ సంవత్సరమే వార్డెన్ మా ఇంటి కొచ్చి అయ్యతో మాట్లాడి నన్ను బడిలో చేర్చేడు. బూదిని వాళ్ళయ్య పంపనన్నాడు. "మేకలు కాయడానికి పిక్కురుదాయి వుండాల... ఒల్లను" అన్నాడు వార్డెన్‌తో నాకు చాల బాధనిపించింది. అలా నేను




బడిలో కెళ్తే బూది పోడు పనులకీ... మేకల కాపుకీ... విప్పమొగ్గలు ఏరడానికీ పరిమితమై పోయింది.

బూదిని చూస్తుంటే జాలేస్తుంది నాకు. బూది మాత్రం తన స్థితికి బాధ పడినట్టు నాకెప్పుడూ అనిపించలేదు. అదో పిల్ల తల్లి అయ్యింది. అంతకుమించి మరేమీ మార్పులేదు దానిలో.

బూది విప్ప మొగ్గలు ఏరుతూనేవుంది. ఆడపిల్లలు హాస్టల్ నుండి వరుసలు వరుసలుగా స్నానాలకై వెళ్తున్నారు గెడ్డకి నాలుగైదేళ్ళ క్రితం నేనూ అదే వరుసలో గెడ్డకు వెళ్ళేదాన్ని సినిమా కథలు చెప్పుకుంటూ. ఇప్పుడు నేనో బాధ్యతగల

టీచర్ని. నన్నందరూ 'అదృష్టవంతురాలిని' అన్నారు. నిజమే. నేను చదువుకున్న బడిలోనే... నాకు ఉద్యోగం రావడం అదృష్టమే అనాలిమరి.

ఈ మధ్య నా వెనక... నా గురించి అందరూ ఏవేవో అనుకుంటున్నట్లు అనిపించేది. నాతోమాత్రం ఎవరూ ఏమీ అనేవారు కాదు. తెలుగుసార్ మాత్రం చెప్పేరు. నాకు కొంత అర్థమయ్యింది. కొంత కాలేదు. అంతా అయ్యేక యిప్పుడు మొత్తం అర్థమయ్యిది.

బద్ధకంగా లేచి అద్దం ముందు కెళ్ళేను.

నా రూపం నాకే కొత్తగా కనిపించింది. అప్రయత్నంగానే గుండెమీద చేయివేసేను. నిన్న పుదయం యిదేవేళకి యిదే అద్దంలో నా నీడ చూసుకున్నప్పుడు... పచ్చగా మెరిసే పసిరిక పాము నా మెడను చుట్టుకుని గుండెమీద తలాన్చి నాలుకలు చాస్తున్నట్టు అనిపించింది. నా ఒళ్ళు జలదరించింది. 'తాళికట్టిన మొగుడట' వాడికెంత ధీమా. ఎంత నాటకమాడేడు.

కిటికీ దగ్గర ఎవరో నిలబడినట్లు గాజుల సవ్వడి. అటు చూసేను. బూది నవ్వుతోంది. దాని చేతిలో ఎర్రపువ్వులు. తలమీద విప్పమొగ్గల గంప, దానివెనక దిస మొలతో దాని కూతురు. బూది ముఖం పరిశీలనగా చూసేను. దానికళ్ళు ఎంత స్వచ్ఛంగా తంగుడుపువ్వుల్లా తళతళ మెరిసిపోతున్నాయి.

బూది పువ్వులిచ్చి వెళ్ళింది.


"బూదికీ నాకూ అట్టే తేడాలేదు. నేను చదువుకున్నాను. బూది చదువుకోలేదు. అయినా నేను బూదికంటే ఏ విధంగా మెరుగైనట్టు? చదువుసందెల్లేని బూది సుక్కడివలలో పడిందంటే అదోదారి. మరి నేను? నేనేం చేసేను? ఇల్లాంటి విషయాల్లో ఆడపిల్లలందరూ... ఒక్కటేనా"?

"అమ్మగారూ..."

ద్వారం దగ్గర అరుణ పాలచెంబుతో నిలబడి వుంది. పాలుపోసి "యింకా స్నానం చేయలేదండీ అమ్మగారూ?" అని నవ్వి ఖాళీ చెంబుతీసుకుని వెళ్ళిపోయింది అరుణ.

అరుణ చలాకైన పిల్ల. పదవ తరగతి చదువుతోంది. క్లాసుఫస్ట్ తనే. పాటలు బాగా పాడుతుంది. సరిగ్గా అరుణలాగే వుండేదాన్ని నేను. అరుణను చూస్తుంటే అప్పటి నన్ను నేను చూసుకుంటున్నట్లే వుంటుంది.

అప్పుడు నేను పదవతరగతి పరీక్షలు రాసేక శలవుల్లో ఇంట్లో వున్నాను. రిజల్టు




కోసం చూస్తున్నాను. ఆరోజు నేను ఇంట్లో కొర్రలు దంచుతున్నాను. అయ్య; కాంట్రాక్టరు రంగరాజుతో మాట్లాడుతున్నాడు... ఇంటిముందున్న మునక్రింద. మా వూరికి ముందు గెడ్డవుంది. ఆ గెడ్డమీద బ్రిడ్జి నిర్మాణమవుతోంది. ఆ బ్రిడ్జి కంట్రాక్టరు రంగరాజు మా యింటికొచ్చేడు. అయ్యకీ అతనికీ బాగా నేస్తం కలిసింది.

బ్రిడ్జి పనులకు కూలీల్ని తీసుకెళ్ళి పనులుచేయించడంతో పాటు కాంట్రాక్టరుకి భోజనాలు అమర్చడం వరకూ అయ్యే చూసేవాడు. పోడు పనులు పక్కన పెట్టేసేడు. అయ్య దినచర్యే మారిపోయింది. అయ్య కొండమీద పాకకెళ్ళి ఎన్నాళ్ళయ్యిందో. ఎప్పుడూ గోచీతో వుండే అయ్య లుంగీ కట్టడం లాల్చీ తొడగడం నేర్చేడు... కాదు కాంట్రాక్టరు నేర్పేడు. నెలకో పదిహేను రోజులకో కాంట్రాక్టర్ గారి వూరికి వెళ్ళేవాడు. కందులో, చింతపండో. పనసపళ్ళో, గుమ్మడికాయలో... మోసుకెళ్ళేవాడు.

పేపరు చూస్తున్న కాంట్రాక్టరు కేకవేసేడు.

"పిల్లా నీ నెంబరెంత. రిజల్టు వచ్చింది."

నెంబరు చెప్పేను. పేపర్లో నెంబరు చూసి సంతోషంగా చెప్పేడు. "ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యేవు పిల్లా... పార్టీ యిచ్చుకో" అని హాస్యమాడి...."విజయనగరం కాలేజీలో చేర్పిద్దాం... హాస్టల్‌లో వుండి చదువుతుంది..." అన్నాడు అయ్యతో.

"నా పిల్లనీపిల్ల కాదా... నీ యిట్టమే... అలాగే సేత్తుం" ఒప్పుకున్నాడు అయ్య. నాకు చెప్పలేనంత ఆనందం కలిగింది.

కాంట్రాక్టరు నాకు కొత్తబట్టలు తెచ్చేడు. అతన్ని చూస్తే అయ్యనిచూసి నట్టే అనిపించింది. నాకాక్షణంలో

నేను విజయనగరంలో కాలేజీలో చేరేను. ట్రైబల్ వెల్ఫేర్ గరల్స్ హాస్టల్లో... కొత్త నేస్తాలతో... కొత్త వుత్సాహంతో... చదువు... ఆనందంగా గడిచేవి రోజులు.

దసరా శలవులకి ఇంటికొచ్చేను.

అయ్యకి ఐ.టి.డి.ఏ ఆఫీసుకు వెళ్ళడం తెల్సింది. అధికారులతో మాట్లాడ్డం తెలిసింది. కాంట్రాక్టరు రాసిచ్చిన కాగితాల మీద వేలి ముద్రలు వేసి 'లోన్లు' శాంక్షన్ చేయించుకోవడం తెలిసింది. అయితే అయ్యచేసే పనులన్ని కాంట్రాక్టరు చెప్పచేతల్లోనే.

నేను మావూరు వచ్చేసరికి గెడ్డమీద బ్రిడ్జిపని చురుకుగా సాగుతోంది. అయితే కాంట్రాక్టరు రంగరాజు లేడు. ఎవరో కుర్రాడున్నాడు. అయ్య చెప్పేడు... "కాంట్రాక్టరుగారికి ఆరోగ్యం బాగాలేదని. ఆ కుర్రాడు కాంట్రాక్టరు కొడుకనీ." నేనున్న పదిరోజులూ నాతో ఏదో ఒకలా మాట కలపాలనీ చూసేవాడు. నేను టీ చేసి యిస్తే కావాలని నా వ్రేళ్ళు తాకాలని ప్రయత్నించేవాడు. నాకు తమాషాగా వుండేది. క్రమంగా అతనితో చనువు పెరిగింది.

ఒకరోజు బాగా పొద్దుపోయింది.

అయ్య మునగ చెట్టు క్రింద కూర్చుని ఖాళీ సిమ్మెంటు సంచులు లెక్క పెడుతున్నాడు. దూరంగా కొండమీద నుంచి పిల్లంగోవి పాట వినిపిస్తోంది. వీధి మధ్య 'సన్నాయి'గాడు డప్పుకొడుతుంటే 'సాంబర' తుడుం మీద దరువులు వేస్తున్నాడు. పిల్లలు గంతులేస్తున్నారు.

అప్పుడు ఓ జీప్‌వచ్చి ఆగింది.

జీప్‌లోంచి పోలీసులు దిగేరు. దిగీ దిగడంతోనే 'వెంకన్న ఎవడ్రా' అని ఓ పోలీస్ అడిగేడు. 'నానే' అని చెప్పాడో లేదో తుపాకీ మడమతో కొట్టేడు అయ్యని.

వీధిలో డప్పుల దరువులు ఆగిపోయేయి.

లాఠీ దరువులు ఆరంభమయ్యేయి.

మా అయ్యనీ... మరో నలుగురు ముసలోళ్ళనీ బాగా కొట్టేరు. నేను ఓసందులో కెళ్ళి దాక్కున్నాను. వాళ్ళు కొట్టడానికి చెప్పిన కారణము 'నక్సలైట్లకు నిన్నరాత్రి అన్నం పెట్టినట్టు వారికి సమాచారం అందిందట. అన్నం పెట్టడం నిజమే. వంట నేనే చేసేను. కానీ వాళ్ళు నక్సలైట్లని నాకు తెలీదు. అయ్య చెప్పేడు... చేసేను. అయినా' ఆకలితో వున్నవాళ్ళకి అన్నం పెట్టడం తప్పెలా అయ్యిందో అప్పటికి నాకు తెలీదు.

అయ్య బాధతో అరిచే అరుపులకు నాకు ఏడుపొచ్చింది. బయటకు రావడానికి భయమేసింది. అయ్య చెప్పిన అప్పటి వుద్యమం కబుర్లు... ఆ కథలు గుర్తుకొచ్చేయి.

"అమ్మా... యీ గెడ్డల అప్పుడు నీరు పారనేదే ఒట్టి రక్తమే పారిందే..." అని చెప్పి ఏడ్చే అమ్మ మాటలు గుర్తొచ్చేయి. పోలీసులు కొడుతూనే వున్నారు.... 'వాళ్ళెవరో చెప్పంర్రా' అని. అప్పుడొచ్చేడు కాంట్రాక్టరుగారబ్బాయి. ఎస్సైతో ఏదో మాట్లాడేడు. ఆ మాటాడే తీరు చూస్తే వాళ్ళిద్దరూ బాగా స్నేహితులనిపించింది. కొట్టడం ఆపి పోలీసులు వెళ్ళేరు. నాకు కాంట్రాక్టరు గారి అబ్బాయిమీద గౌరవం పెరిగింది.

శలవలు పూర్తయ్యేక విజయనగరంలో తనకు పనివుందని బయలుదేరుతూ నన్ను తన స్కూటర్ మీద తీసుకెళ్ళేడు. అతని వెనుక కూర్చున్ననాకు చిత్రమైన అనుభూతి కలిగింది. ఆ తరువాత నేను చాలసార్లు ఆ బండిమీద కూర్చున్నాను. నా ఇంటర్మీడియట్ చదువు పూర్తయ్యింది. చివరి పరీక్షరాసేక నన్ను అన్నవరం తీసుకెళ్ళేడు. 'మనం పెళ్ళి చేసుకుందాం' అన్నాడు. శకుంతల దుష్యంతుల కథ చెప్పి 'మనది గాంధర్వ వివాహం' అన్నాడు. నేను మౌనంగా విన్నాను... నా అంగీకారం తెలియజేసేను తలవూపి. నాకెందుకో నిరాకరించాలని అనిపించలేదు. చాలమంది విద్యావంతులు యిలాగేచేస్తారని చాలా వుదాహరణలు చూపించి నా మెడలో తాళికట్టేడు.

ఊహించని విధంగా నాకు ఇంటర్వ్యూ వచ్చింది... ఆ వెంటనే సెకెండరీగ్రేడు టీచర్‌గా... వేస్తూ ఆర్డర్సు వచ్చేయి. అదీ నేను చదువుకున్న బడిలోనే....

పెళ్ళి... ఉద్యోగం ఒకేసారి నన్ను అదృష్టవంతురాల్ని చేసేయని పొంగిపోయేను. టీచర్సు క్వార్టర్సులో నాకివ్వబడిన ఇంట్లో కొత్త కాపురం ప్రారంభించేం. మా అయ్య మాత్రం పాత ఇల్లు వదిలి రానన్నాడు.

మా అయ్యలో మాత్రం మునుపటి ఉత్సాహం లేదు. తన మనసులో ఏముందో చెప్పడు...

ఓ రోజు అయ్య బాధతో మూలుగుతున్నాడు. అప్పుడే పోస్ట్‌మెన్ ఉత్తరాలిచ్చి వెళ్ళేడు. అందులోఒకటి బ్యాంకు నుంచి. దుక్కి. ఎడ్లు 'లోన్' వడ్డీతో సహా చెల్లించమని.

అయ్యతో చెప్తే... "అదేటి కాంట్రాటు బావ్ కట్టనేదేటి?" అని ఆశ్చర్యపోయేడు. నాకు అర్థమైంది... 'కాంట్రాక్టరు అయ్యని మోసం చేసేడు' అని అదే చెప్పేను మా అయ్యతో... కంట్రాటు బావు... అలగ సేత్తాడా. అని ముందునమ్మలేదు.

మా ఆయనతో చెప్పేను. అతను చిరాగ్గా ముఖంపెట్టి "నాకేం సంబంధం లేదు" అని తేల్చేసేడు.

నాకు కోపం వచ్చింది... ఏడుపూవచ్చింది.


సరిగ్గా అప్పుడే మరో ఉత్తరం వచ్చింది. అది మా ఆయన భార్య రాసింది. పిల్లలకు ఆరోగ్యం బాగాలేదని... తొందరగా రమ్మని అప్పటికిగాని తెలియలేదు... నా స్థానం ఏమిటో...

కాంట్రాక్టరు చేసిన... అప్పులకి అయ్య మునిగి పోయేడు పీకల్దాక. అతని కొడుకు చేసిన పనికి. .. నేను...

అప్పుడప్పుడూ... నాతో పనిచేసే టీచర్సు నేను వెళ్ళే సరికి ఆపివేసే మాటల సారాంశం ఏమిటో యిప్పుడు బోధపడుతోంది.

బ్రిడ్జి పనులు పూర్తయ్యేయి.

ఐదురోజుల తర్వాత వచ్చేడు మా ఆయన. అతనితో ఓ ఇంజనీరును తీసుకొచ్చేడు. మందు... విందు... ఏర్పాటుచేసేడు. ఇంజనీరుకు యిష్టమైన వంటకాలు నా చేత చేయించేడు. నన్ను బాగా అలంకరించుకోమన్నాడు. ఆ పైన అతగాడు చెప్పిన మాటలు వినలేక కుమిలి కుమిలి ఏడ్చేను...




అతగాడిని... అప్పటికప్పుడు కత్తితీసి పొడిచెయ్యాలన్నంత కోపం వచ్చింది. కానీ లేచి నిలబడలేని నీరసం ముంచుకొచ్చింది. ఆ రాత్రి మా అయ్యపాకకు వెళ్ళిపోయేను. "ఎందమ్మీ" అని అడిగిన అయ్యకి ఏం చెప్పగలను?... మాటాడకుండా పడుకున్నాను. అప్పుడు వెళ్ళినవాడు మరోవారం తరువాత వచ్చేడు. నేను పలకరించలేదు సరికదా కన్నెత్తి చూడనైనా లేదు.

"నీకు ట్రాన్స్ఫర్ ఆర్డరు తెచ్చేను. నీవు నాతో వస్తున్నావు" అన్నాడు. నాకు ఒళ్ళు తెలియని కోపం వచ్చింది. బదిలీ కాగితం లాక్కుని ముక్కలు ముక్కలుగా చించి అతడి ముఖం మీదికి విసిరేను.

"నువ్వు మనిషివేనా... ఛీ... నీలాంటి మేకవన్నెపులులు మా కొండల్లో కొచ్చి... పచ్చని అడవికి చిచ్చుపెడతన్నారని తెలుసుకోలేక పోయాము. విద్యావంతులూ...

మా మీద అభిమానంతో మా గిరిజనుల బ్రతుకుల్ని బాగుచేస్తారనీ... నమ్మామే కాని, మమ్మల్ని పీల్చి పిప్పిచేస్తారనీ... మా బ్రతుకుల్తో ఆటలాడతారనీ అనుకోలేదు. మా గిరిజన గూడల్ని అభివృద్ధి చేస్తారని అనుకున్నాం గానీ... అభివృద్ధి పేరుతో అణగదొక్కేస్తారని అనుకోలేదు.

నువ్వు బ్రిడ్జికట్టి ఆ బ్రిడ్జిమీదుగా బస్సుల్లో... కార్లలో నాగరికతనీ... విజ్ఞానాన్ని తీసుకొస్తావని భ్రమ పడ్డాం కాని మా కొండల్ని కొల్లగొట్టి బళ్ళకెత్తి ఆ బ్రిడ్జి మీదుగానే మొసుకుపోతావని అనుకోలేదు.

మీ నాగరికతలతోటి... మీ తెలివి తేటల్తోటి మమ్మల్ని దోచుకున్నది చాలు, వెళ్ళు... యింకొక్క నిమిషం యిక్కడ నిలబడ్డావో ఏం చేస్తానో నాకే తెలీదు.

"..... నీ మెడలో తాళికట్టేను... ఆ సంగతి మరిచిపోకు..." ధీమాగా అన్నాడు. నాకు అరికాలిమంటి నెత్తికెక్కింది. ఎండు కంపలు అంటించిన పోదుమంటలా... కోపం... ఉవ్వెత్తున లేచింది.

"ఏమన్నావ్... తాళికట్టేవా... కట్టుకున్నదాన్ని పరాయోడి పక్కలోకి వెళ్ళమన్న నువ్వు... తాళికట్టిన మొగుడివా... యిదేనా... మీ నాగరికత... నాగరికత నట్టేట కలిసిపోను... యిదిగోరా... నీ బోడి తాళి...." ఫట్‌న మెడలోని తాళి తెంపి విసిరేసేను. చచ్చిన పాములా అతని కాళ్లకు చుట్టుకుంది పసుపుతాడు. దానిని వంగి తీస్తున్నప్పుడు అతడు నాకు పాములోడిలాగా కనిపించేడు. పాములోడు నయం విషసర్పాల కోరలుతీసి వాటిని ఆడించి ఆనందం పంచుతాడు, మరి వీడు తానే పామై కాటేస్తాడు.

"నీతో వచ్చి నీ పెళ్ళాం పిల్లలకి సేవచేసే పని మనిషిలా పడివుండాల్సిన ఖర్మనాకులేదు. నా జీతం నీ దోసిట్లో పోసి తిరిగి నిన్ను ముష్టి ఎత్తుకునే దౌర్భాగ్యస్థితీ నాకు అవసరం లేదు. నీ తండ్రి నా తండ్రినీ... తండ్రిలాంటి కొండనీ... దోచుకుంటే నువ్వు నా వయసునీ... నా స్వేచ్ఛనీ... నా బ్రతుకునీ దోపిడీ చేసేవు అది చాలక నా మీద వ్యాపారం చెయ్యాలనుకున్నావు..."

"కులాంతర వివాహం పేరుతో... ప్రభుత్వాన్ని మోసంచేసి... సామాజికంగా రాజకీయంగా మమ్మల్ని ఎంత పీడనికి... గురిచెయ్యాలనుకున్నావో... ఛీ... నీ ఒక్కొక్క ఆలోచనా ఒక్కొక్క నాగుపాము... పో యిక్కడినుంచి... మోసాలు చేస్తూ... మోసాల్లో కూరుకుపోతూ ఆ మోసాల్లోనే చావు... పో..."

ఆవేశంలో నా నరాలు చిట్లిపోతాయేమో అనిపించింది. ఈ హడావుడికి అందరూ గడపల్లోకి వచ్చి నిలబడి చోద్యం చూస్తున్నారు. దఢాలున తలుపుమూసేను.

అద్దంలో నా మెడ... ఉరితాడు తీసేసినట్టుంది. హాయిగా వుంది. నా మెడ చెత్తో ఓసారి తడిమేను. నునుపుగా అద్దాన్ని తాకినట్టనిపించింది. దూరంగా పర్వతశ్రేణులు అలలు అలలుగా నీలంగా... ఎండపడి కనుచూపుమేర కనులకు విందుచేస్తున్నాయి. విశాలంగా నన్ను ఆహ్వానిస్తున్నట్టు.

మా పాత ఇంటిముందు మునగచెట్టు క్రింద బూది దాని కూతురికి జడవేస్తోంది. దాని ప్రక్కన మేకపిల్లలు చెంగు చెంగున గంతులు వేస్తున్నాయి. హాస్టల్ పిల్లలు బ్రేక్ ఫాస్ట్ కోసం పళ్ళేలు పట్టుకుని వరుసలుగా నిలుచున్నారు.

గడపలోకి వచ్చేను. స్కూలు ప్రార్థనాస్థలంలో జండా కోసం కట్టిన దిమ్మమీద కూర్చుని తెలుగుసార్ ఏదో కొత్తపాట చెప్తున్నట్టుంది. అరుణ... గణపతిసారు సాధన చేస్తున్నారు. అటువేపు అడుగులు వేసేను.... అప్రయత్నంగా.

నా కళ్ళముందు గిరిజన గూడలు... గిర్రున తిరిగేయి.

అభివృద్ధి పేరుతో... నాగరికత ముసుగులో నశించిపోతున్న నా జాతి సంస్కృతి నగ్నరూపం కనిపించింది. అడవిపిట్టల్లాంటి తమ్ముళ్ళు... చెల్లెళ్ళు చదువుల పేరుతో... నాగరికత పేరుతో స్వేచ్ఛకీ స్వచ్ఛతకీ దూరమౌతున్నారేమో... ననిపించింది, థింసానృత్యాలకీ, కంది కొత్తల పండగలో ఆనందంగా వేసే... చిందులకూ దూరమైపోతున్న నావారి దురదృష్టానికి... నాకు బాధ కలిగింది.

చిరుద్యోగాలనే వరంగా భావించి ప్రాథమిక స్థాయిలోనే చదువుల్ని ఆపేసి ఐ.టి.డి.ఏ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న నాతరం... అజ్ఞానానికి నాకు జాలి కలిగింది.

చిరుగులబట్టల్లోంచి చదువుల పేరుతో మెరుగు బట్టల్లోకి వచ్చిన మాట నిజమే అయినా చిరిగి పోతున్న నా జాతి సంస్కృతి, చెరిగిపోతున్న సాంప్రదాయాలు... నన్ను కలవరపరిచేయి.

నాగరికత వలలో చిక్కి 'నగరసాగర' తీరాన పడి గిలగిల లాడుతున్న నా సోదర సోదరీమణులు నా కళ్ళముందు నిలిచేరు. 'మోసపూరితమైన నాగరికతనేర్పే' కొత్తపాఠాలతో... అదే బాటలో నడవాలనుకుంటే నా జాతి...? యీ ఆలోచనకు నా ఒళ్లు జలదరించింది. చినిగిన సంస్కృతీ విలువల్లో నా అడవి తల్లి దీనంగా చూస్తున్నట్లయ్యింది.

రోడ్డుమీదికి చూసేను.

నాతోపాటు ఉద్యోగంలో చేరిన ఓ అమ్మాయి. ఎవరో అబ్బాయితో బండివెనుక కూర్చుంది. అతడేదో చెప్తుంటే ఆమె నవ్వుతోంది. నాకు జాలేసింది.

అరుణా.., గణపతిసారూ, పాడుతున్నపాట శ్రావ్యంగా అలలు అలలుగా గాల్లో తేలి కొండలనడుమ గింగిరాలు తిరుగుతూ ప్రతిధ్వనిస్తూ దిక్కులకు వ్యాపిస్తోంది.

....

సెల్లెలా... ఓ సెల్లెలా
కొండమల్లె పువ్వా నాసెల్లెలా...
జాగర్త... జాగర్త... సెల్లెలా... నీ బతుకుజాగర్త... సెల్లెలా...
మాయా మర్మం ఎరగని సెల్లెలా...
నువ్వు సేయకమ్మ జాలమింక సెల్లెలా...
నిన్ను మోసగించినోడ్ని సెల్లెలా... నిల దీసి అడగాల... సెల్లెలా...
మల్లెపువ్వా' 'నువ్వు... ముల్లులాగ మారాల
కొండపిల్ల పేరింటే సెల్లెలా...
ఆడి గుండె జారి పోవాల సెల్లెలా..

పాట నా చెవిలో మారుమ్రోగుతోంది. నా కర్తవ్యాన్ని గుర్తుచేస్తోంది. చాల రోజుల తరువాత గెడ్డవేపు వెళ్ళేను స్నానానికి

కాంట్రాక్టరు లారీ బ్రిడ్జిమీదుగా... పల్లంవేపు సాగిపోతోంది.

'సెల్లెలా' పాట నా వెన్నంటే వస్తోంది.

కొండలూ... చెట్లు... వాగులూ... వంకలు... పిట్టా పులుగూ... అడివి అడివంతా... మరో మార్పుకు... సిద్ధంగా వున్నట్టు... దూరంగా... ఊళ్లోంచి తుడుము డప్పు దరువులు... పాటకు శృతి కలుపుతూ... మంద్రమంద్రంగా వినవస్తున్నాయి. ●

* అంకితం : నా మిత్రుడు, తన ఎన్నో ఆశయాలు కార్యరూపం దాల్చే దశలో అర్థాంతరంగా మృత్యువును వరించి వెళ్ళిన'నృత్య చూడామణి'... తోయక లింగు ప్రసాద్ (గిరిజన కళాకారుడు) కు... సజల నయనాలతో.